అమర ప్రేమికులు

వసుంధర

"ఇంత రాత్రివేళ ఎక్కడికిరా బయల్దేరావ్?" అంది మాలతమ్మ కొడుకు వంక ఆశ్చర్యంగా చూస్తూ.

"సెకండ్ షో సినిమాకమ్మా!" అన్నాడు ముత్యాల్రావు.

"సెండ్ షో కెందుకూ — రేపు ఆదివారమేగా—ఏ మ్యాట్నీకో వెళ్ళొచ్చు—" అంది మాలతమ్మ.

"ఆ సినిమాకు మ్యాట్నీకి టికెట్ దొరకడానికి ఇంకా రెండు నెలలేనా గడవాలి. రేపు ఆదివారం కాబట్టే ఈ రోజు సెకండ్ షోకు వెడుతున్నాను—" అని తల్లి ఇంక యెదురు ప్రశ్నలేమీ వేయకుండా చకచక వీధిలోకి నడిచాడు ముత్యాల్రావు.

ముత్యాల్రావుకి చాలా ఉత్సాహంగా వుంది. బయట కాస్త చలిగా వున్నా ఉత్సాహంలో ఆ చలి తెలియడం లేదు.

సెకండ్ షో అని తను తల్లికి అబద్ధం చెప్పాడు.

కానీ తను నిజానికిప్పుడు వెతుకుతున్నది సినిమాకు కాదు-వేదవతి వద్దకు.

వేదవతి పేరు తల్చుకోగానే అతడి తనువు పులకరించింది.

వేదవతి వయసులో ఉన్నదన డానికి ఆమె వయసు పొంగుల సాక్ష్యం వున్నది. ఒకసారామెవైపు చూసిన వాళ్ళు మళ్ళీ కళ్ళు తిప్పుకోలేరు. ఆమె గొప్ప అందగత్తె కాకపోవచ్చు కానీ చాలా సెక్సీగా వుంటుంది.

వేదవతి ముత్యాలరావుని ప్రేమించింది. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నది. ముత్యాలరావూ ఆమెను ప్రేమించాడు కానీ పెళ్ళిచేసుకోవాలనుకోవడం లేదు.

వేదవతి తన అభిప్రాయం అతడికి పూర్తిగా చెప్పింది. ముత్యాలరావు తన అభిప్రాయం ఆమెకు సగంమాత్రమే చెప్పాడు.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను కానీ..." అని ఆగిపోయాడతను.

ఆ వాక్యం అతడిచేత పూర్తి చేయించడానికి వేదవతికి వారం రోజులు పట్టింది. "నువ్వు నన్ను నమ్మవు, అపార్థం చేసుకుంటావు, అసహ్యించుకుంటావు. మన ప్రేమ ఇలాగే వుండిపోనీ—" అంటూ అతడామెకు అసలు సంగతి చెప్పకుండా వారం రోజులు దాటవేశాడు. ఆమె నొక్కించగా తన మనసులోని మాట చెప్పాడు.

ఈ రోజుల్లో పెళ్ళయ్యాక యెందరో దంపతులు సెక్సు పరంగా ఇబ్బందులకు గురవుతున్నారు. అందువల్ల పెళ్ళికి ముందే కొంతకాలం దాంపత్య జీవితం అనుభవించి ఒకరికొకరు నచ్చినదీ లేనిదీ తేల్చుకోనడం మంచిదని

ముత్యాల్రావు అభిప్రాయం.

ఇది విని వేదవతి తెల్లబోయింది. తర్వాత నెమ్మదిగా- "నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నీకోసం ఏమైనా చేయగలను. ఎందుకైనా సిద్ధపడతాను. కానీ ఆ తర్వాత నువ్వు నన్ను మోసం చేయకూడదు—" అన్నది.

ఆమెను మోసం చేయడం కోసమే ముత్యాల్రావు ఆ షరతు పెట్టాడు. ఆడది యెందువల్లనో ఈ ఒక్క విషయాన్ని విస్మరిస్తుంది.

ముత్యాల్రావుకు వేదవతిని పెళ్ళిచేసుకోవడం ఇష్టం లేదు. అందుకు చాలా కారణాలున్నాయి. వాటిలో మొదటిది ఆమె చాలా సెక్సీగా వుండడం. ఆడది అంత సెక్సీగా వుండడం—మగవాడుగా సహించగలడు. కానీ భర్తగా భరించలేడు.

ఆపైన వేదవతికి యెవ్వరూ లేరు. పదిమంది దయతో చందాలమీద చదువుకుని ప్రస్తుతం ఉద్యోగం చేస్తోంది. అంత సెక్సీగా ఉన్న మనిషి ఇంతకాలం స్వచ్ఛంగా ఉండగలగడం కష్టం.

ఈ రెండు కారణాలను బట్టి ముత్యాల్రావు ఏ తరహా మనిషో ఊహించవచ్చు. అతడామెను పెళ్ళిచేసుకోక పోవడానికి ఏమేం కారణాలుండవచ్చునో వేరే వివరించ నవసరంలేదు.

ఈ ముత్యాల్రావును ప్రేమించి వేదవతి అతడినొక మహోన్నత వ్యక్తిగా భావిస్తున్నది. అతడి కోరిక తీర్చ డానికి ఈ రోజు ముహూర్తం పెట్టింది.

ముత్యాల్రావు ఓసారి సమయం చూసుకున్నాడు. తొమ్మిదిన్నర అయింది. వేదవతి పెట్టిన ముహూర్తం

పది గంటలు.

"రాత్రంతా పూర్తిగా సేదాన్ని. నాకు నమ్మక మున్నది — నేను నీకు నచ్చుతానని!" అంది వేదవతి అమాయకంగా.

ఆమె ఒక చిన్న ఇంట్లో ఉంటున్నది. ఆ యింటి వారూళ్ళో లేరు. మూడు రోజులవరకూ రారు. పగలైతే చుట్టుపక్కలవారికి తెలిసిపోతుంది. రాత్రి తొమ్మిది గంటలు దాటాక ఆ వీధంతా సద్దుమణుగుతుంది.

ముత్యాల్రావు కాలినడకన వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. చేసేది తప్పు పనని అతడికి తెలుసును. అందుకని సాక్ష్యాలు లేకుండా జాగ్రత్తపడుతున్నాడు.

సరిగ్గా పదిగంటలకు ముత్యాల్రావు వేదవతి ఇల్లు చేరుకున్నాడు.

వీధి నిర్మానుష్యంగా ఉన్నది. ఇళ్ళల్లో అంతా నిద్రపోతున్నట్లున్నారు. వీధిలో కుక్కలు కూడా మొరగడం లేదు.

వేదవతి ఇంట్లో మాత్రం దీపం వెలుగుతున్నది. తలుపు ఓరవాకిలిగా వేసి వుండడంవల్ల బయట మెట్లమీద వెలుగు పడుతున్నది. ఆ మెట్లు యెక్కేముందు ముత్యాల్రావు మరో పర్యాయం వీధిలో చుట్టూ చూశాడు. అప్పుడు గబగబా మెట్లు ఎక్కాడు. ఓరవాకిలిగా వున్న తలుపు తోశాడు.

అంతే!

వివేకం హెచ్చరించకపోతే అతడు కెవ్వుమని అరిచి వుండేవాడే!

గదిలో మంచం. మంచంమీద వేదవతి. ఆమె చేయి ఒకటి క్రిందకు వేలాడుతున్నది. వంటిమీద బట్టలు

ఆ సత్య సంగా వున్నాయి. అయితే ఆమె సెక్సీగా లేదు. నిర్జీవంగా వున్నది. అందుకు సాక్ష్యం—ఆమె గుండెలవద్ద కనిపిస్తున్న కత్తి పిడి—అక్కణ్నించి ధారగా ప్రవహించి ఎండిన రక్తం!

ముందడుగు వేయాలా? వెనక్కి పోవాలా?

వేదవతి చచ్చిపోయింది. ఎవరో చంపేశారు.

తానిప్పుడు పోలీసులకు రిపోర్టు చేయాలా? లేక....

ముత్యాల్రావు చటుక్కున వెనక్కి తిరిగాడు. చకచకా మెట్లు దిగాడు. అతడి బుర్ర పనిచేయడం లేదు. కాళ్ళు మాత్రం పనిచేస్తున్నాయి.

వచ్చేటప్పుడు ముప్ఫై అయిదు నిమిషాలు పట్టింది. కానీ ఇప్పుడతడు ఇరవై రెండు నిమిషాల్లో ఇల్లు చేరాడు.

"అదేమిట్రా—అప్పుడే సినిమా అయిపోయిందా?" అంటూ ఆశ్చర్యపోయింది ఆతడి తల్లి.

"సెకండ్ షోకు కూడా టికెట్లు దొరకలేదమ్మా—" అన్నాడు ముత్యాల్రావు. అయితే తను కోరిన టికెట్ ఈ జీవితకాలానికి దొరకదని అతడికి తెలుసు.

2

మూడు నాలుగు రోజుల వరకూ ముత్యాల్రావు వేదవతి ఇంటివైపు వెళ్ళలేదు. పేపర్లో ఆమె హత్య గురించిన వార్త వస్తుందేమోనని చూశాడు. పేపర్లలో రాలేదు. ఊళ్ళో యెవరూ చెప్పుకోవడంలేదు.

వేదవతిని ఎవరు చంపారు? ఎందుకు చంపారు? ఆ తర్వాత ఆమె శవం ఏమైంది?—ఈ విధమైన ఆలోచనలతో ముత్యాల్రావు సతమతమైన మాట మాత్రం నిజం. అయితే ఈ ప్రశ్నలకు సమాధానం దొరికే చోటుకి మాత్రం అతడు వెళ్ళలేదు.

నాలుగు రోజులు గడిచాక అతడికింక ఫరవాలేదని పించింది. ధైర్యంచేసి, ఆ యింటికి వెళ్ళాడు.

ఆ యింట్లో ఇప్పుడు మనుషులున్నారు. కానీ వేదవతి లేదు.

ముత్యాల్రావు వేదవతి స్నేహితుడని ఆ యింట్లో వారికి తెలుసు. అయితే అతడు చాలా మర్యాదస్థుడనే దురభిప్రాయం కూడా వారికి వున్నది.

"మేము నిన్ననే వచ్చామండి. వేదవతి ఊళ్ళోలేదు. ఇంటికి తాళంపెట్టి యెదురింటి వాళ్ళకు ఇచ్చి వెళ్ళిందట" అన్నాడు ఇంటి వాళ్ళ చిన్నబ్బాయి ప్రసాద్.

"ఎప్పుడిచ్చిందట?" అన్నాడు ముత్యాల్రావు కుతూహలంగా.

ఆ అబ్బాయి చెప్పాడు.

ముత్యాల్రావు ఆశ్చర్యంగా-"నిజంగా?" అన్నాడు.

ఆ అబ్బాయి అతడివంక ఆశ్చర్యంగా చూస్తూ— "మీరంత ఆశ్చర్యపడ్డారేమిటండీ?" అన్నాడు.

ముత్యాల్రావు ఆశ్చర్యపడకేం చేస్తాడు? తానామెను నిర్జీవంగా చూసిన మర్నాఁడుదయం ఆమె ఆ పని చేసిందంటే ఎలా నమ్మగలడు?

"నువ్వు నాకో ఉపకారం చేయాలి. మీ ఎదురింటి వాళ్ళ దగ్గరకు వెళ్ళి తాళంచెవి వాళ్ళకు వేదవతి స్వయంగా ఇచ్చిందో, యెవరిచేతనైనా పంపించిందో కనుక్కొని వచ్చి నాకు చెప్పాలి—" అన్నాడు ముత్యాల్రావు.

"ఎందుకండీ?" అన్నాడా కుర్రాడు.

"తర్వాత చెబుతాను...." అన్నాడు ముత్యాల్రావు.

రెండు నిమిషాల్లో ప్రసాద్ తిరిగివచ్చి—"మీ రెలా

ఊహించారో గానీ వాళ్ళింట్లో తాళం చెవి ఇచ్చింది వేదవతి కాదుట. యెవరో యువకుడట. సన్నంగా, పొడవుగా వున్నాడట. చిన్న గెడ్డం కూడా వుందట.." అన్నాడు.

"చాలా థాంక్స్!" అన్నాడు ముత్యాల్రావు అక్కణ్ణించి కదులుతూ.

సన్నగా, పొడవుగా వుండి చిన్న గెడ్డం వుండే ఆ యువకుడెవరో ముత్యాల్రావూహించగలిగాడు. అతడి పేరు మోహన్. వేదవతికి ఇంకో స్నేహితుడు. వేదవతి పెళ్ళి గురించి తనను బలవంత పెడుతున్నట్లే అతడు వేదవతిని పెళ్ళి గురించి బలవంత పెడుతున్నాడు. అయితే వేదవతి ముత్యాల్రావునే ప్రేమిస్తున్నానంటున్నది.

మోహన్ కారణంగా కూడా ముత్యాల్రావుకు వేదవతి సచ్ఛీలతపై నమ్మకం పోయింది. వాళ్ళిద్దరూ చనువుగా తిరగడం చాలాసార్లు చూశాడతను. వేదవతిని నిలదీసి అడిగితే—"అతడు చాలా మంచి స్నేహితుడు—" అని ఊరుకున్నది.

"మంచి స్నేహితుడు ప్రేమికుడు కాలేడా?" అన్నాడు ముత్యాల్రావు.

"నా ఆలోచనల్లో నువ్వుండగా మరే మగవాడూ నాకు ప్రేమికుడు కాలేడు—" అంది వేదవతి.

"అలాంటప్పుడు అతడితో యెందుకు తిరుగుతావ్? నలుగురూ అపార్థం చేసుకునే అవకాశముంది—" అన్నాడు ముత్యాల్రావు.

"ఏం చేసేది? ఓసారి ఓ ఇరుకు సందులో నలుగురు రౌడీలు నన్నల్లరి పెట్టబోయారు. ఈ మోహన్ నన్ను

రక్షించాడు."

"అది చాలా పాత ట్రిక్కు...."

"పాతదో, కొత్తదో నాకు అనవసరం. ఆ యిరుకు సందులో అతడు నన్నేం చేసినా నాకూ దిక్కులేదు. అతడు నన్ను ఆడదానిలా వాంఛించడం లేదు. భార్యను చేసుకోవాలనుకుంటున్నాడు. అలాంటి వాడు మంచి స్నేహితుడు కాడా?" అంది వేదవతి.

"నిన్ను భార్యను చేసుకోవాలనుకునేవాడు స్నేహితుడెలాగౌతాడు?"

"నేనలా అనుకోవడం లేదు కాబట్టి! అతడు నా మాటలను మన్నించే రకం కాబట్టి!"

"అతడు నువ్వు చెప్పినట్లే వినేపక్షంలో అతడినే పెళ్ళి చేసుకోనవచ్చు కదా!"

"ముందే చెప్పాను. ఆడది జీవితంలో ఒక్కసారే ప్రేమిస్తుంది. నేను ప్రేమించడం అప్పుడే అయిపోయింది—" అంది వేదవతి.

"మోహన్‌కు లేని—నాలోవున్న ఆ విశిష్టత ఏమిటి?"

"మోహన్ మనిషి మంచివాడే.... కానీ అన్ని దురలవాట్లూ ఉన్నాయి. తాగుతాడు, వ్యభిచరిస్తాడు. నా భర్త అతడిలాకాక నీకులా ఉండాలన్నది నా సహజమైన కోరిక...."

"అన్ని దురలవాట్లున్నవాడిని నువ్వు స్నేహితుడిగా మాత్రం ఎలా భరిస్తున్నావ్?" అన్నాడు ముత్యాలరావు.

వేదవతి నవ్వింది—"కొందరు పైకి ఎంతో పెద్ద మనుషుల్లా కనబడుతుంటారు. వాళ్ళకు దురలవాట్లుండక పోవచ్చు. కానీ ఏ మాత్రం అవకాశం వచ్చినా ఆడదాన్ని మోసం చేయాలనే చూస్తూంటారు. అలాంటి

వారే ప్రమాదకరమైన స్నేహితులు. మోహన్ దురల వాట్లకు బానిస కావచ్చు. కానీ అతడు మనసున్న మనిషి. నాపట్ల అతడెంతో మర్యాదగా వ్యవహరిస్తాడు. నన్ను తాకడానికి కూడా నా అనుమతి కావాలి అతడికి. అతడి తీరు చూస్తూంటే నాకెంతో ఆశ్చర్యంగా వుం టుంది. అన్నింటికీ మించి అతడిలో నిజాయితీ వున్నది. తన దురలవాట్ల గురించి అతడే నాకు చెప్పుకున్నాడు. లేకుంటే నాకు అతడి గురించి తెలిసేది కాదు. అన్ని విధాలా మంచివాడైన ఆ స్నేహితుడు నన్ను ప్రేమి స్తున్నానంటే అతడి బారినుంచి తప్పించుకోనడం కోసం త్వరగా నిన్ను వెతుక్కున్నాను. నువ్వు నాకు దొరకడం నా అదృష్టం—"

ముత్యాలరావుకీ మాటలు విన్నాక చాలా అను మానాలు వచ్చాయి. తన్ను తాకడానికి కూడా అనుమతి కావాలంది. మోహన్ కెప్పుడైనా ఆమె అలాంటి అనుమతి ఇచ్చిందా? మోహన్ బారినుండి తప్పించు కొనడంకోసం తనను వెతుక్కున్నానంటున్నది. మోహన్ ఆమెను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడా? చేస్తున్నాడంటే ఎందుకు? ఆమె ఏదైనా తప్పు చేసిందా? ఆ తప్పు శీలానికి సంబంధించిందా? తనామెకు దొరకడం అదృ ష్టంగా భావిస్తోంది. తనకోసం ఏమైనా చేస్తుందా?

మర్యాదగా కనబడుతూ ఆడదానికి ద్రోహం తల పెట్టేవారి గురించి ఆమె మాట్లాడిందన్న విషయం మాత్రం అతడి ఆలోచనల్లోకి రాలేదు.

ఆ మోహన్‌కి అన్ని దురలవాట్లూ ఉన్నాయి. పెళ్ళికోసం ఆమె వెంటబడుతున్నాడు. అయితే ఆమె నిరాకరించింది. నిన్న తను పూర్తిగా ముత్యాలరావుకు

వశమైపోతున్నానని ఆమె మోహన్‌కు చెప్పిందా? అప్పుడు మోహన్ ఆమెను...

ముత్యాల్రావు ఓసారి మోహన్‌ను కలుసుకుని మాట్లాడాలనుకున్నాడు.

3

"నమస్కారమండీ — మీరు మా యింటికి వస్తారని ఎప్పుడూ అనుకోలేదు—" అన్నాడు మోహన్ ముత్యాల్రావును సాదరంగా ఆహ్వానిస్తూ.

ఆ యిల్లు చూస్తూ ముత్యాల్రావు చాలా ఆశ్చర్యపోయాడు.

మోహన్ తాననుకున్నంత చౌకబారు మనిషి కాడు.

నాలుగు గదుల ఇల్లు అది. డ్రాయింగ్ రూంలో కార్పెట్ పరిచి వుంది. గదిలో స్టీరియో సెట్టు, టెలివిజన్ ఉన్నాయి. ఆ ఊళ్ళో టెలివిజన్ రాదు. కానీ బూస్టర్ పెడితే అప్పుడప్పుడు మద్రాసు వస్తుందట. గది అలంకరణ కూడా ఉన్నతాభిరుచులతో ఉంది.

ముత్యాల్రావు ఇబ్బందిగా సోఫాలో కూర్చుని—"వేదవతి గురించి తెలుసుకుందామని వచ్చాను—" అన్నాడు.

"వేదవతి ఊళ్ళో లేదుగా — ఊరు వెడుతున్నట్లు మీకు చెప్పలేదా?" అన్నాడు మోహన్ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

"నాకు చెప్పలేదు. ఏ ఊరు వెళ్ళిందో యెప్పుడు వెళ్ళిందో చెబుతారా? ఆమెను నేను అర్జంటుగా కలుసుకుని మాట్లాడాలి—" అన్నాడు ముత్యాల్రావు.

"వెళ్ళింది అమలాపురం. మీరు వెళ్ళి కలుసుకోవడం అనవసరం. రేపు తిరిగి వచ్చేస్తుంది—" అన్నాడు

మోహన్.

ముత్యాల్రావు ఉలిక్కిపడి—"రేపే వచ్చేస్తుందా—అదెలా సాధ్యం — అసంభవం?" అన్నాడు. అతడి కనులముందు నిర్జీవంగా వున్న వేదవతి శరీరం మెదులుతున్నది.

"అసంభవమా—ఎందుకని?" అన్నాడు మోహన్.

ముత్యాల్రావుకు ఏం బదులివ్వాలో తోచలేదు—"ఇంతకీ ఆమె అమలాపురం యెప్పుడు వెళ్ళిందో చెప్పలేదు—...." అన్నాడు.

మోహన్ చెప్పాడు.

"అరె—అదెలా సాధ్యం—అసంభవం?" అన్నాడు ముత్యాల్రావు. తనామెను నిర్జీవంగా చూసిన మర్నాడుదయం ఆమె అమలాపురం బయల్దేరి వెళ్ళిందంటే తానెలా నమ్ముతాడు?

"మీరేమంటున్నారో నాకు అర్థం కావడంలేదు. నేనే స్వయంగా వెళ్ళి ఆమెను బస్సు ఎక్కించి వచ్చాను—...." అన్నాడు మోహన్.

"సరే లెండి. వేదవతి రాగానే నాకు కబురు చేస్తారా?" అన్నాడతడు.

"నేను మీకు కబురు చేయడమెందుకు? రాగానే తనే ఆమె మిమ్మల్ని కలుసుకుంటానని అన్నది...." అన్నాడు మోహన్.

"ఏమో-అలా జరుగదని నాకు అనిపిస్తున్నది. రేపు మీరు ఏ సమయంలో ఇంట్లో ఉంటారో చెబితే వచ్చి కలుసుకుంటాను...."

"మీకు అంత శ్రమ ఎందుకు? ఫోన్ చేయండి - చాలు.... నా నంబరిస్తాను...." అన్నాడు మోహన్.

అప్పుడే గ్రహించాడు ముత్యాలరావు—అతనికి ఫోను కూడా ఉన్నదని!

నెంబరు తీసుకుని ఆ యింటి నుంచి బయటపడినాక ముత్యాలరావు ఆలోచించసాగాడు. మోహన్ కు ఎలాంటి అలవాట్లున్నాయో తనకు తెలియదు.... కానీ ...అతడు సొసైటీలో మర్యాదస్థుడని అనిపించుకునే విధంగానే జీవిస్తున్నాడు. అతడి ముందు తను చాలా విధాలుగా తీసికట్టు. అతడిని కాదని వేదవతి తనను ప్రేమిస్తున్నదంటే అందుకు కారణం ఏమిటి?

వేదవతి ఏమైంది? ఆమె చావలేదా? మోహన్ తనే ఆమెను స్వయంగా అమలాపురం బస్సు యెక్కించానంటున్నాడు. అది నిజమా? మరి తను చూసిన సంగతి ఏమిటి?

మోహన్ వేదవతిని చూశానంటున్నాడు. అందుకు అతడు తప్ప వేరే సాక్ష్యం లేదు. వేదవతిని అతడే చంపి రాత్రికి రాత్రి ఆ శవాన్ని మాయంచేసి ఈ విధంగా నాటకమాడుతున్నాడా?

మోహన్ ని చూస్తూంటే హత్య చేసినవాడిలా అగుపించడంలేదు. నిర్విచారంగా, నిర్భయంగా ఉన్నాడు. బహుశా గుండెలు తీసిన బంటు అయియుండాలి.

పైగా రేపే ఆమె అమలాపురం నుంచి వచ్చేస్తుందంటున్నాడు. ఆమె నిజంగా వస్తుందా? ఒక్కరోజు చూస్తే అన్నీ తెలుస్తాయి.

ఆ ఒక్కరోజూ ఆగడం ఎంతో కష్టమనిపించింది ముత్యాలరావుకి.

మర్నాడు సాయంత్రం అతడు మోహన్ కి ఫోన్ చేశాడు.

"వేదవతి రాలేదండీ—పనులు కాలేదనీ—యింకా రెండ్రోజుల వరకూ రాలేననీ టెలిగ్రాం ఇచ్చింది. కానీ అదిప్పుడే అందింది. మీ ఫోన్ నంబరు చెప్పండి. ఆమె రాగానే ఫోన్ చేసి మీకు తెలియబరుస్తాను...." అన్నాడు మోహన్ ఫోన్లోంచి.

ముత్యాల్రావు ముఖం చిన్నబోయింది—"నాకు ఫోన్ లేదు. నేనే మిమ్మల్ని కంటాక్టు చేస్తాలెండి...." అని ఫోన్ పెట్టేశాడు.

అతడు తన ఆఫీసు నుంచి చేశాడు ఫోన్. ఈ సమాచారం ఆఫీసుకు చేరడం అతడి కిష్టంలేదు. మోహన్ యెలాంటివాడంటే అతడు వేదవతి గురించిన సమాచారమంతా మరెవరికయినా చెప్పి ముత్యాల్రావుకి అందజేయమనవచ్చు.

మోహన్‌కి ఫోను ఉంది. తనకు లేదు.

ఆ విషయమలా వుంచితే యిప్పుడు వేదవతి బ్రతికి ఉన్నట్లా, లేనట్లా?

మోహన్ ఏదో నాటకమాడుతున్నాడు. వేదవతి గురించి తన కేమీ తెలియదనడానికి బదులు—ఆమె యింకా బ్రతికి ఉన్నదన్న భ్రమ తనకు కలిగించాలనుకుంటున్నాడు. అతడాశించే ప్రయోజన మేమిటి?

తను శవం చూసినట్లు అతడికి తెలియదు. తెలిస్తే ఏమవుతుంది?

మోహన్ హంతకుడు. వేదవతిని హత్య చేశాడు.

వేదవతి హత్య కాలేదని తన్ను నమ్మించాలని చూస్తున్నాడు మోహన్.

ఇప్పుడు తనేం చేయాలి?

హఠాత్తుగా వేదవతి గుర్తొచ్చింది.

పాపం—వేదవతి తనను మనసారా ప్రేమించింది. తన్ను పెళ్ళి చేసుకుని తనతో హాయిగా జీవించాలని కలలు గన్నది. అందుకోసం మోహాన్ వంటి వాణ్ని కూడా వదులుకోవాలనుకున్నది. పెళ్ళికి ముందే తనకు సర్వస్వం అర్పించాలనుకున్నది.

ఇప్పుడు వేదవతి జీవించిలేదు. ఆమెను చంపినవాణ్ని తను బయట పెట్టవద్దూ?

ముత్యాల్రావు బాగా ఆలోచించాడు. అతడి బుర్ర చురుగ్గా పని చేసింది.

తను మోహాన్ని బ్లాక్ మెయిల్ చేస్తే!....

వేదవతి చనిపోయిందని తనకు తెలుసు. ఆ చావుకు కారణం హత్య అనీ తెలుసు. హంతకుడు మోహాన్ అని ధృవపడుతోంది.

అలాంటప్పుడు........

వేదవతి వంటి అమాయకురాలిని చంపినందుకు మోహాన్కు జీవితంలో మనఃనిమితం లేకుండా చేయాలి. అందులోనూ వేదవతి తనకు ప్రియురాలు.

ఆ పైన....డబ్బు కూడా సంపాదించవచ్చు....

ముత్యాల్రావు రాత్రి తన ఇంట్లో గదిలో ఒంటరిగా కూర్చుని ఓ ఉత్తరం తయారుచేశాడు'

"డియర్ మోహాన్!

నువ్వు వేదవతిని చంపిన విషయం నాకు తెలుసు. నీ నేరం బయటపెట్టే ఉద్దేశ్యం నాకు లేదు. పదివేల రూపాయలు ఓ బ్రీఫ్ కేసులో పెట్టి రాత్రి సమయంలో పూర్వం వేదవతి ఉండే యింటి దొడ్లో—విడిగా ఉండే ఎర్ర ఆకుల

క్రోటన్సు మొక్క క్రింద పాతిపెట్టు. ఈ రాత్రికే అది జరగాలి....

నీ

శ్రేయోభిలాషి"

ఉత్తరం పూర్తిచేసి కవర్లో పెట్టి మోహన్ యింటి అడ్రసుకు పోస్టు చేశాడు ముత్యాలరావు. అలవాటు లేని పని కావడంవల్ల అతడికి చేతులు వణికాయి. అయితే అలవాటులేని పని అయినప్పటికీ అతడు చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు.

ఉత్తరం వ్రాసేటప్పుడు చేతికి గ్లవ్స్ తొడుక్కున్నాడు. ఉత్తరం కష్టపడి ఎడమచేతితో వ్రాశాడు. పోస్టు చేసేటప్పుడు కూడా కవరుమీద వ్రేలిముద్రలు పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నాడు. తన మీదకు అనుమానం రాకుండా అది వేరే వీధిలోని పోస్టు డబ్బాలో వేశాడు.

ఆ ఉత్తరం అందేక మోహన్ ఏం చేస్తాడు? తను చెప్పిన విధంగా వెళ్ళి అక్కడ డబ్బు పాతి పెడతాడా?....

పాతిపెడితే తను వెళ్ళి ఆ డబ్బు ఎలా తీసుకోనడమో అతడు ముందే ఆలోచించాడు. అంతకు ముందే అతడింకో పథకమూ ఆలోచించాడు. మోహన్‌కి తనమీద అనుమానం రాకుండా ఉండడం కోసం ముందు జాగ్రత్త అది!

4

"అరే—ఫోన్ చేయవచ్చుగా—యింటికే వచ్చారేమిటి? అదీ కాక వేదవతి రావలసిన రోజు రేపు గదా—...." అన్నాడు మోహన్.

"నేను వేదవతి కోసం రాలేదు. మీ కో కొత్త విశేషం చెప్పడానికి వచ్చాను—" అంటూ ముత్యాల్రావు మోహన్ కో ఉత్తరం చూపించాడు.

డియర్ ముత్యాల్రావ్!

నువ్వు వేదవతిని చంపిన విషయం నాకు తెలుసు. నీ నేరం బయటపెట్టే ఉద్దేశ్యం నాకు లేదు. పదివేల రూపాయలు ఓ బ్రీఫ్ కేసులో పెట్టి రాత్రి సమయంలో పూర్వం వేదవతి ఉండే యింటి దొడ్లో—విడిగా ఉండే ఎర్ర ఆకుల క్రోటన్సు మొక్క క్రింద పాతిపెట్టు. ఈ రాత్రికే అది జరగాలి....

నీ

శ్రేయోభిలాషి"

మోహన్ ఆ ఉత్తరాన్ని ఆశ్చర్యంగా చదివి—"అంటే వేదవతి బ్రతికి లేదంటారా? అమలాపురం చేరేక ఆమె నెవరయినా చంపేసే రంటారా....?" అన్నాడు.

"ఏమో—అదేమీ నాకు తెలియదు. కానీ వీడెవరో నన్ను బ్లాక్ మెయిల్ చేస్తాడేమిటీ?" అన్నాడు ముత్యాల్రావు.

మోహన్ గతుక్కుమని—"అవును....వాడెవరో కానీ యెందుకు మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు? మీ గురించిన ఆధార మేదో వాడికి చిక్కి ఉంటుంది. అయినా ఆమె అమలాపురంలో ఉన్నట్లు మీకూ, నాకూ తప్ప యెవ్వరికీ తెలియదు. మీరుగానీ అమలాపురం వెళ్ళారా? అక్కడ ఆవేశంలో ఆమెను.... ... ." అని ఆగి పోయాడు.

ముత్యాల్రావు తెల్లబోతూ—"ఆమెను నేను హత్య చేశానంటారా? ఎందుకు చేస్తానూ?" అన్నాడు అమాయకంగా.

"వేదవతితో స్నేహం చేసినవారంతా ఆమెను చంపాలనుకునే క్షణం యెప్పుడో ఒకసారి వస్తుంది—" అన్నాడు మోహన్.

సంభాషణ ఈ విధంగా దారిమళ్ళడం ముత్యాల్రావుకి నచ్చలేదు. మోహన్‌ని ట్రాప్ చేయబోయి తనే ట్రాప్‌లో పడుతున్నాడా అని అనుమానం కూడా వచ్చిందతడికి.

"ఈ ఉత్తరం చూశాక నాకు అనుమానంగా వుంది. ఇంక వేదవతి రాదు. ఆమె ఈ లోకంలో లేదు...." మోహన్ కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

అనుకోకుండా తను మోహన్‌కి సాయపడ్డానని ముత్యాల్రావు గ్రహించాడు. అందుకని తను యే పని మీద వచ్చాడో అది వెంటనే మొదలుపెట్టా లనుకున్నాడు.

"వేదవతికి మీతోనూ నాతోనూ తప్ప వేరెవ్వరితోనూ ప్రస్తుతం స్నేహం లేదు. ఆమె హత్య చేయబడి ఉంటే మనిద్దరిలోనూ ఒకడు హంతకుడయ్యుండాలి. నాకు వచ్చిన ఉత్తరాన్ని బట్టి ఓ మనిషివద్ద నన్ను హంతకుడిగా ఋజువుచేసే ఆధారాలేమో ఉన్నాయి. ఆ మనిషి ఎవరు? అతడీ ఆధారాలెలా సంపాదించాడు? అతడే హంతకుడా? ఆధారాలు తనే సృష్టించాడా?.... ఇవన్నీ మనం తెలుసుకోవాలంటే ఆ హంతకుడికి మనమో అవకాశమివ్వాలి. అందుకోసం నేనో పథకం వేశాను.

అందులో మీ సాయం కావాలి—" అన్నాడు ముత్యాల్రావు.

"చెప్పండి—" అన్నాడు మోహన్.

"నేనో చిన్న ప్లాస్టిక్ పెట్టె తెస్తున్నాను. దాన్ని ఆ క్రోటన్స్ క్రింద పాతిపెడదాం. ఆ పెట్టెలో డబ్బుండదు. కానీ వుందనుకుని హంతకుడు దానికోసం ప్రయత్నిస్తాడు. అతడిమీద నిఘా వేయాలి. లేదా యే డిటెక్టివుకైనా ఈ పని అప్పగించాలి...." అన్నాడు ముత్యాల్రావు.

"ఇందులో డిటెక్టివుల ప్రసక్తి యెందుకు? సాహసిక చర్యలంటే నా కెంతో ఇష్టం. ఆ పని నేనే చేయగలను...." అన్నాడు మోహన్.

"సరే—అయితే మనమిద్దరం కలిసి వేడదాం—" అన్నాడు ముత్యాల్రావు.

"అసలు మనం ఆ క్రోటన్స్ క్రింద పనిగట్టుకుని వెళ్ళి పాతిపెట్టడమెందుకు? హంతకుడనేవాడుంటే మనం పాతిపెట్టామని ఊహించుకుని వెళ్ళడా?"

"ఏమో—ఏం చెప్పగలం? వాడు మనని వెయ్యి కళ్ళతో కనిపెడుతూ వుండివుండవచ్చు. మనం ఆ క్రోటన్స్ క్రింద యేదో పాతామని తెలిసినాక నే అక్కడికి వెళ్ళి చూసుకోన వచ్చు...." అన్నాడు ముత్యాల్రావు.

"మీరు మనం మనం అంటున్నారు. ఈ కేసులో ఇంతవరకూ నాకే సంబంధమూ లేదు—" అన్నాడు మోహన్ ఇబ్బందిగా.

"అయాం సారీ—కానీ వేదవతి హత్యా నేరం విషయం మనిద్దరం కలసి సమిష్టిగా పరిశోధించాలన్నది

నా అభిప్రాయం. ఇప్పుడు చెప్పండి—వేదవతి ఉంటు న్నది అద్దె యిల్లు. వాళ్ళింటికి వెళ్ళి క్రోటన్సు మొక్క క్రింద యీ ప్లాస్టిక్ పెట్టేను పాతే ఉపాయ మేమిటి? సాహసిక చర్యలంటే మీకు యిష్టమని అంటున్నారు. ఇందు కేదయినా పథకం చెప్పండి!" అన్నాడు ముత్యాల్రావు.

మోహన్ కొద్దిక్షణాలు ఆలోచించి—"ఇది చాలా సులభం. ఈ రోజు శనివారం. స్కూల్సుకి సెలవు. ఆ యింట్లో ప్రసాద్ ఒక్కడే వుంటాడు. మగవాళ్ళ ఉద్యోగాలకీ—ఆడవాళ్ళు సంగీతానికో, కుట్టుపనులు నేర్చుకుందుకో బయటకు పోతారు. ప్రసాద్‌ని టాకిల్ చేయడం పెద్ద కష్టంకాదు. రండి—వెడదాం...." అన్నాడు.

ఇద్దరూ వెళ్ళారు. మోహన్ చెప్పినట్లే యింట్లో ప్రసాద్ ఒక్కడే వున్నాడు.

మోహన్ కా యింటి గురించి అన్ని అరా లెలా తెలుసు? అతడు శనివారాలు వెళ్ళి వేదవతిని కలుసుకుం టూండేవాడా? ప్రసాద్‌ని యే విధంగా టాకిల్ చేసే వాడు?....ముత్యాల్రావు మనసులో రకరకాల ఆలోచ నలు తలెత్తాయి.

"వేదవతి ఊర్నించి రావడానికింకా రెండు రోజులు పట్టవచ్చు. తను వేసిన ఎర్ర ఆకుల క్రోటన్సు మొక్కకు ఎరువు వేయమని ఆమె చెప్పివెళ్ళింది. అలా చేయకపోతే ఆమెకు కోపం వస్తుంది. ఈ రోజే వున్నట్లుండీ నాకీ విషయం గుర్తుకు వచ్చింది. వెంటనే పరుగున వచ్చాను. దారిలో ఈయన కనిపించారు...." అన్నాడు మోహన్.

ఆ ఎర్ర ఆకుల క్రోటన్సు మొక్కను వేదవతి వేసు

కుంది. దాన్ని ప్రాణంగా చూసుకుంటోంది. ఆ విషయం తనకు చెప్పింది. మోహన్‌కు కూడా చెప్పిందా? వేదవతి తనతో ఉన్నంత చనువుగానూ మోహన్‌తో కూడా ఉంటుందా?....ముత్యాలరావు ఆలోచిస్తున్నాడు.

అంతా దొడ్లోకి వెళ్ళారు. వారు కోరిన ప్రకారం ప్రశాద్ గునపం తీసుకునివచ్చాడు. ముత్యాలరావు గునపం అందుకున్నాడు.

మోహన్ ప్రసాద్‌ని పక్కకు తీసుకుని వెళ్ళి కబుర్లలో పెట్టాడు.

ముత్యాలరావు గునపం తీసుకుని జాగ్రత్తగా మొక్క చుట్టూ తవ్వసాగాడు, అతడి బుర్రలో యెన్నో ఆలోచనలు....

తను పోస్టు చేసిన ఉత్తరం నిన్ననే మోహన్‌కి అందిందన్న విషయం ధృవపర్చుకున్నాడు. ఆ ఉత్తరం చదివేక మోహన్ భయపడి వుంటాడు. అప్పుడేం చేస్తాడు? ఉత్తరంలో చెప్పిన ప్రకారం డబ్బిక్కడ పాతిపెట్టాడా? అతడి వ్యవహారం చూస్తూంటే ఏమీ తడబడుతున్నట్టు లేదు సరిగదా అసలా ఉత్తరం తనకు అందనట్లే వ్యవహరిస్తున్నాడు.

మొక్క చుట్టూ తవ్వడం పూర్తయింది. ముత్యాలరావు నెమ్మదిగా మొక్కను పైకి తీశాడు. దాని అడుగున ఓ చిన్న ప్లాస్టిక్ పెట్టె వున్నది. అతడు ఆత్రుతగా ఆ పెట్టె తెరిచి చూశాడు. అందులో ఒక వందరూపాయల నోట్ల కట్ట వున్నవి. అంటే సరిగ్గా పదివేలు.

ముత్యాలరావోసారి వెనక్కు చూశాడు. కాస్త దూరంగా మోహన్, ప్రసాద్ మాట్లాడుకుంటున్నారు. ఇద్దరూ ఈ లోకంలో వున్నట్లు లేరు.

ముత్యాల్రావు నోట్లకట్టను తన జేబులోకి తోసేశాడు. తను కూడా తెచ్చిన ప్లాస్టిక్ పెట్టెను కూడా అక్కడే పాతిపెట్టి పైన యధాప్రకారం మొక్కను పాతిపెట్టాడు. తర్వాత అతడు వాళ్ళిద్దరి వద్దకూ వెళ్ళి—"హమ్మయ్య—వచ్చిన పనయింది—" అన్నాడు.

ప్రసాద్ దారి చూపించగా అతడు బాత్రూముకు వెళ్ళి కాళ్ళు, చేతులు కడుక్కున్నాడు.

ముత్యాల్రావు, మోహన్ కలిసి ఇంట్లోంచి బయటకు వచ్చేరు.

"ఇంక నన్ను రోజూ కాపలా వుండమంటారా?" అన్నాడు మోహన్.

"రోజూ యెందుకు? యీ రాత్రికి ఉంటే చాలు........"

"ఏమో—వాడీ వేళే వస్తాడని గ్యారంటీ ఏమిటి? మనం కాచుకుని ఉంటామన్న అనుమానంతో వాడు కొన్నాళ్ళు వేచివుండవచ్చును...." అన్నాడు మోహన్.

"ఏమో-నాకు మాత్రం హంతకుడి ఆచూకీ దొరికినట్లే అనిపిస్తున్నది—" అన్నాడు ముత్యాల్రావు.

5

"అబ్బా — యెవరూ?" అంటూ విసుగ్గా లేచింది ముత్యాల్రావు తల్లి. ఆమె మంచి నిద్రలో వుండగా ఎవరో తలుపు తట్టారు.

ఆమె తలుపు తీసి ఎదుటి వ్యక్తిని చూసి—"యెవరు నువ్వు?" అని అడిగింది.

అతడామెకు పూర్తిగా అపరిచితుడు.

"మీ అబ్బాయి స్నేహితుణ్ని. అతడితో అర్జంటుగా మాట్లాడాలి. ఓసారి లేపండి—" అన్నాడతడు చాలా

వినయంగా.

తల్లి వెళ్ళి కొడుకును లేపింది. ముత్యాల్రావు విసుక్కుంటూ లేచాడు.

"ఎవరో నీ స్నేహితుడినంటూ వచ్చాడు.." చెప్పింది తల్లి.

ముత్యాల్రావు మత్తు వదిలింది. వెళ్ళి ఆ స్నేహితుణ్ని చూశాడు. అతడెవరో తెలియక — "ఎవర్నువ్వు?" అనడిగాడు.

"వేదవతి హత్య గురించి మాట్లాడ్డానికి వచ్చాను. ఏదైనా గదిలోకి పోయి మాట్లాడుకుందాం—" అన్నాడతడు తగ్గింపు స్వరంలో.

ముత్యాల్రావతణ్ని తన పడక గదిలోనికి తీసుకని వెళ్ళాడు. అతడి స్నేహితుడు వెనకనుంచీ తలుపులు మూశాడు.

"తలుపు లెందుకు మూశావ్?" అన్నాడు ముత్యాల్రావు.

"బయట నీ అమ్మ ఉంది. బాగుండదని!" అన్నాడతడు.

"ఎందుకని?"

అతడు చొక్కా విప్పాడు. అతణ్ని చూస్తూ దిమ్మెర పోయాడు ముత్యాల్రావు. సన్నగా కనబడుతున్నా కండలు తిరిగి ఉన్నాడతడు.

"ఇందుకు?" అన్నాడతడు కండలు పొంగిస్తూ.

"ఎవరు నువ్వు?" అన్నాడు ముత్యాల్రావు భయంగా.

"వేదవతిని చంపినవాణ్ని—" అన్నాడతడు.

ముత్యాల్రావుకి నోట మాటరాలేదు. అతడు హంతకుడా? తను మోహన్‌కి ఉత్తరం వ్రాస్తే అతడెలా

గొచ్చాడు?

"అయితే ఇక్కడికెందుకొచ్చావ్?"

"నా పదివేలూ తీసుకుని పోవడానికి...."

"ఏ పదివేలు?"

"బుకాయించకు. అంతా నాకు తెలుసు...."

"నిజంగా నాకేమీ తెలియదు—" అన్నాడు ముత్యాలరావు.

"నేను హత్యలు చేసేవాడినే కావచ్చు. కానీ అనవసర రక్తపాతం నాకిష్టముండదు. అందుకని మర్యాదగా అడుగుతున్నాను. లేని పక్షంలో నీ వద్దనుంచి డబ్బు తెచ్చుకునే మార్గం నాకు తెలుసు...." అన్నాడతడు.

ముత్యాలరావు ఆలోచిస్తున్నాడు. ఎవరితడు? తనవద్ద పదివేలూ ఉన్నట్లు ఇతడికెలా తెలుసు?

"వేదవతి చనిపోయి ఉంటే ఆమెను మోహన్ చంపి వుండాలి. నువ్వామెను చంపి ఉంటావంటే నేను నమ్మలేకపోతున్నాను...." అన్నాడు ముత్యాలరావు.

"మోహన్ చంపమన్నాడు. నేను చంపాను. మోహన్ డబ్బు పాతిపెట్టమన్నాడు. నేను పాతిపెట్టాను. ఇప్పుడు మోహన్ డబ్బు తెమ్మన్నాడు. నేను తెస్తున్నాను...."

"అంటే?" ముత్యాలరావు బుర్ర చురుగ్గా పనిచేస్తోంది.

మోహన్ చాలా తెలివైనవాడు. తెగించినవాడు. అతడి జోలికి తనవంటి సామాన్యుడు వెళ్ళడం ఏమాత్రం మంచిది కాదు.

"వేదవతి చనిపోతే — ఆమె శవం ఏమైంది?" అన్నాడు ముత్యాలరావు.

"చంపడం నా వంతు అంతే!" అన్నాడతడు.

ముత్యాలరావు వందరూపాయల నోట్ల కట్ట అతడికిచ్చి "ఇది నాకు క్రోటన్సు మొక్క క్రింద దొరికింది. అక్కడి కెలా వచ్చిందో నాకు తెలియదు...." అన్నాడు.

"నువ్వు చాలా బుద్ధిమంతుడివి. వస్తాను...." అని అతడు వెళ్ళిపోయాడు.

"ఎవర్రా అతడు?" అంది ముత్యాలరావు తల్లి.

"నా స్నేహితుడమ్మా!" అన్నాడు ముత్యాలరావు.

"ఎందుకొచ్చాడు?" అంది తల్లి.

"ఎందుకా?" అని — "ఎందుకో నీ కెందుకులే అమ్మా—తర్వాత చెబుతాను. ఇప్పుడు నిద్రవస్తోంది—" అనేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు ముత్యాలరావు.

నిద్రవస్తోందని తల్లితో అయితే చెప్పాడుగానీ ఆ రాత్రి యెంత సేపటికీ అతడికి నిద్రపట్టలేదు. పదివేల రూపాయలు చేతికి దొరికినట్లే దొరికి పోయాయి. వేదవతి హత్య గురించిన వివరాలూ తెలిశాయి. కానీ హంతకుడిని తానేమీ చేయలేని స్థితిలో ఉన్నాడు. తను వేదవతి శవాన్ని మాత్రం చూశాడు. ఆ శవం ఏమైందో కూడా తెలియదు.

6

ఆ రోజు మోహన్ ఇంటికి వేదవతి రావలసిన రోజు.

అతడిని మళ్ళీ కలుసుకుని మాట్లాడాలంటే ముత్యాలరావుకు భయంగా ఉన్నది. అయితే ఉత్తరం గురించి ఏమీ తెలియనట్లు నటించిన మోహన్ ముందు తనూ నటించలేడా?

సాయంత్రం ఆఫీసునుంచి ఫోన్ చేశాడు ముత్యాలరావు.

"వేదవతి వచ్చిందండీ—" అన్నాడు మోహన్

ముత్యాలరావుకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదు.

"ఎప్పుడు?" అన్నాడతడు.

"ఓ గంటయింది. తిన్నగా మాయింటికే వచ్చింది....

"ఇప్పుడు మీ ఇంట్లోనే ఉందా?" అన్నాడు ముత్యాలరావు ఆత్రుతగా.

"ఆఁ" అన్నాడు మోహన్.

"ఓ అరగంటలో వస్తున్నాను. మీ రక్కడే ఉండండి—...." అని ఫోన్ పెట్టేశాడు ముత్యాలరావు.

ముత్యాలరావుకి మనసు మనసులో లేదు. వేదవతి చని పోలేదా? అయితే ఆ రోజు తను చూసిన శవం సంగతి ఏమిటి?

ఏదో నాటకం జరిగింది. అది తెలుసుకోవాలంటే తను ఆమెను కలుసుకుని మాట్లాడాలి.

సరిగ్గా అర గంటలో అతడు మోహన్ ఇంట్లో ఉన్నాడు.

తలుపులు తెరిచే ఉన్నాయి. మోహన్ సోఫాలో కూర్చుని ఉన్నాడు. గదిలో ఇద్దరి మాటలు వినిపిస్తున్నాయి. ఒకడు మోహన్ రెండోది కంఠం వేదవతిది. అందులో ఏమీ సందేహం లేదు. అయితే....

అక్కడి దృశ్యం చూసి నిశ్చేష్టుడయ్యాడు ముత్యాలరావు.

మోహన్ కుర్చీలో కూర్చుని ఎదుటి వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అతడి మాటలకు ఎదుటి వ్యక్తి నుంచి బదులు వస్తున్నది. కానీ....

ఆ గదిలో మోహన్ ఒక్కడే వున్నాడు.

ఉన్నట్లుండి మోహన్ ముత్యాలరావును చూశాడు.

"హలో—రండి....రండి.... వేదా..... ముత్యాలరావు

గారొచ్చారు...." అంటూ అతడిని సాదరంగా ఆహ్వానించాడు.

"రా....నీ గురించే మాట్లాడుకుంటున్నాం...." అంది వేదవతి.

ఆమె మాటలు వినబడ్డాయి. కానీ ఆమె అతడికి కనబడలేదు.

"ఆమె ఎక్కడ?" అన్నాడు ముత్యాలరావు.

"ఆమె అంటే?" అన్నాడు మోహన్.

"వేదవతి...."

"నీ ఎదురుగా ఉంటే ఎక్కడని అడుగుతావేమిటి? మాత్యం—నీకు గానీ మతిపోయిందా?" మందలింపు స్వరం వేదవతిది వినిపించింది.

"నాకు మతిపోయినట్లే ఉంది. మాటలు వినబడుతున్నాయిగానీ ఆమె నాకు కనబడ్డంలేదు...." అన్నాడు ముత్యాలరావు.

"ముందు—మీరిలా వచ్చి కూర్చోండి...." అన్నాడు మోహన్.

మోహన్‌కి పక్కగా కూర్చున్నాడతడు.

"కనపడక పోవడానికి నేనేమైనా దెయ్యాన్నా, భూతాన్నా—" అంది వేదవతి.

అప్పుడు ముత్యాలరావుకు అనిపించింది. ఆ కంఠ స్వరం కూడా సినిమాల్లో దెయ్యాలకులా సన్నగా ఉన్నది. కానీ అది వేదవతి కంఠమేనని అతడికి కచ్చితంగా తెలుసును.

"మీకు ఇంకా వేదవతి కనబడ్డంలేదా?" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"మీకూ కనబడుతున్నదని అనుకోను. మీరు నన్నేదో

ఆటపట్టిస్తున్నారు...." అన్నాడు ముత్యాల్రావు.

"మిమ్మల్ని ఆటపట్టించడం నాకేమవసరం...." అన్నాడు మోహన్.

ముత్యాల్రావు ఆలోచిస్తున్నాడు..

మోహన్ ఎందుకో తనతో ఆటలాడుతున్నాడు. ఎదురుగా వేదవతి లేదన్న విషయం తథ్యం. కానీ ఆమె మాటలు ఎలా వస్తున్నాయి? తన ప్రశ్నలకామె బదులెలా ఇవ్వగలుగుతున్నది? కచ్చితంగా అది టేపు రికార్డరు వ్యవహారం కాదు.

మరి?

ఇంతకీ ఈ నాటకం ప్రయోజన మేమిటి?

"ఏమిటి ముత్యం — అలా మౌనంగా ఉంటావ్? ఏమైనా మాట్లాడు...."

అది వేదవతి కంఠం. సందేహంలేదు. కుర్చీలోంచే వస్తున్నది. అందుకూ సందేహం లేదు. అయితే ఆమె కనబడదేం?

ఒకవేళ....ఆమె చచ్చి దెయ్యమయిందా?

ముత్యాల్రావు లేచి కుర్చీని సమీపించాడు. అందులో తడుముబోగా ఏమీ తగలేదతడికి. ఈలోగా మోహన్ అతడిని సమీపించి పక్కకు లాగి—"మిస్టర్ ముత్యాల్రావ్! మీరు ప్రేమించిన ట్లే నేనూ ఈమెను ప్రేమించాను. మనిద్దరిలో ఎవరినామె వివాహం చేసుకుంటుందో తెలియదు. కానీ అంతవరకూ మనం ఒకరి ఎదుట ఒకరు ఆమెతో చనువుగా ఉండరాదు. నేనామెను తాకను. మీరూ ఆమెను తాకరాదు—...." అన్నాడు.

"ఆమె నాకు కనబడనప్పుడు తాకడం ప్రసక్తి ఎక్కడ?" అన్నాడు ముత్యాల్రావు నీరసంగా. ఇదంతా

ఏమిటో అతడికి అర్థంకాకుండా ఉన్నది.

అప్పుడతడికి కుర్చీలోంచీ నవ్వు వినబడింది. ఆ నవ్వు వింటూంటే వేదవతి కుర్చీలో కూర్చుని ఉండి నవ్వు తున్నదనే అనిపిస్తుంది.

ఇందులో ఏదో మోసముంది! వేదవతి మోహన్ కలిసి ఏదో నాటకమాడుతూండి ఉండాలి. లేదా ఆమె దెయ్యమై వచ్చి మోహన్ మీద పగ తీర్చుకునే ప్రయత్నంలో ఉండిఉండాలి. తను దెయ్యమై వచ్చానన్న విషయం తెలియడంకోసం తనకు కనబడంలేదు.

అయితే ఇందులో ఓ తిరకాసున్నది. వేదవతిని మోహన్ హత్య చేసివుంటే, లేదా చేయించివుంటే— ఆమె తిరిగిరావడాన్ని అతడు అనుమానించాడా? తనను భ్రమలో ఉంచడానికి అతదేదో నాటకమాడు తున్నాడా?

అంతా అయోమయంగా ఉంది — "నేను వెళ్ళి పోతాను—" అన్నాడు ముత్యాల్రావు.

"సరే—ముత్యం.... నేను వచ్చి నిన్ను కలుసుకుని మాట్లాడతాగా—" అన్న వేదవతి గొంతు వినిపించింది. ఆ గొంతు వింటూంటే అతడికి భయంవేసింది. చరచరా అడుగులు వేశాడు. మోహన్ చటుక్కున అతడినను సరించి అందుకుని—"నిజంగా మీకు వేదవతి కనబడ్డంలేదా?" అన్నాడు.

"నాకు అబద్ధాలాడే అలవాటు లేదు..." అన్నాడు ముత్యాల్రావు.

"ఆ విషయం నాకు తెలుసులెండి..." అన్నాడు మోహన్.

అప్రయత్నంగా మోహన్ ముఖం వంక చూశాడు

ముత్యాల్రావు. తను మోహన్ కు ఉత్తరం వ్రాయడం, తనకూ ఉత్తరం వచ్చినట్లు చూపించడం, క్రోటన్సు మొక్క కింద డబ్బు పాతడం కోసం మోహన్ సాయం కావాలని అర్థించడం...ఇవన్నీ ఏమిటి..అబద్ధాలు కావా? అని అతడు ప్రశ్నిస్తున్నట్లుగా అనిపించిందతడికి.

"మరెందుకీ ప్రశ్న వేశారు?"

"ఆమె కట్టుకున్న లేత నీలం షిఫాన్ చీర, అదే రంగు బ్లవుజు, గులాబి రంగులోని ఆమె శరీరఛాయ, చెవులకు వ్రేలాడే పెద్ద పెద్ద రింగులు...ఇందులో ఏమీ మీకు కనబడలేదా?"

ముత్యాల్రావు అదోలా అతడి వంక చూసి బదులేమీ ఇవ్వకుండా అక్కణ్నించి వెళ్ళిపోయాడు. అతడు వేదవతి నెందుకు వర్ణించాడో అప్పుడు తెలియలేదు ముత్యాల్రావుకు.

7

ముత్యాల్రావు తిన్నగా తన స్నేహితుడు వాసు ఇంటికి వెళ్ళి—"నీకు తెలిసిన గొంతు ఒకటి కుర్చీలోంచి వినిపిస్తుంది. మనిషి కనబడడు. నువ్వడిగిన ప్రశ్నలన్నింటికీ జవాబులు వస్తూంటాయి. అప్పుడా కుర్చీలో దెయ్యమున్నదనుకోనా లేక దీనికి సైన్సు ఏమైనా బదులివ్వగలదా?" అనడిగాడు.

వాసు సైంటిస్టు. స్నేహితుడి ప్రశ్న విని అతడు నవ్వి "దెయ్యాలు లేవని నేను అనలేదు. నా జ్ఞానం పరిమితం. ఆ కుర్చీలో దెయ్యం లేదని నేను చెప్పలేను. కానీ సైన్సు అలాంటి ఏర్పాటు చేయగలదు. నువ్వు వాకీటాకీల గురించి వినే ఉంటావు. మినీ రేడియో స్టేషన్ అనుకో! కుర్చీలో స్పీకరు బిగించి ఉండవచ్చు. పక్క గదిలోంచి

రహస్యంగా నిన్ను గమనిస్తూ, నీ మాటలు వింటూ ట్రాన్స్మిటర్ ద్వారా నీకు బదులిస్తూంటే—విజయవాడ రేడియో స్టేషన్‌లోని సినిమా పాటలు—నీ యింట్లో రేడియోలో వినబడినట్లే—పక్క గదిలోని మాటలు ఆ కుర్చీలోంచీ వస్తాయి. కావాలంటే నీకది చూపించగలను కూడా—...” అన్నాడు.

“ఇలాంటిదేదో జరిగి ఉండవచ్చనని నేనూ ఊహించాను. ఓసారి నా కళ్ళతో నేను చూస్తాను... చూపించు...” అన్నాడు ముత్యాల్రావు.

వాసు అతడి యెదురుగా ఉన్న కుర్చీలో ఓ రేడియో ఉంచాడు. దాన్ని ఆన్ చేసి ఓ ఫ్రీక్వెన్సీకి ట్యూన్ చేశాడు. అప్పుడు ముత్యాల్రావుకు ట్రాన్స్మిటర్ చూపించాడు. అది ఒక చిన్న మైక్రోఫోన్‌లాగున్నది. అప్పుడతడు పక్క గదిలోకి వెళ్ళాడు.

కొద్ది క్షణాల్లో రేడియోనుంచి వాసు గొంతు వినబడింది.

“అలా కూర్చొండి పోయావేం? లేచి నిలబడు... నేను నీ స్నేహితుణ్ణి కదా—నా కాలిలో ముల్లు దిగితే తీయడానికి కాస్త సాయం చేయవచ్చుగా...”

ముత్యాల్రావుకి అంతా అర్థమయింది. అతడు వాసుకు ధన్యవాదాలు చెప్పుకుని తిన్నగా ఇంటికి వెళ్ళిపోయాడు.

“ఏరా—ఈ రోజు ఆలస్యమైంది?” అనడిగింది తల్లి. ముత్యాల్రావు బదులివ్వలేదు. అతడు వేదవతి గురించే ఆలోచిస్తున్నాడు.

వేదవతి ఏమైంది? బ్రతికి ఉందా, లేదా? ఆమె తనను కలుసుకుంటానంది. ఎప్పుడు, ఎక్కడ, ఎలా కలుసుకుంటుంది? కలుసుకుని ఏం మాట్లాడుతుంది?

రాత్రి భోజనాలు కాగానే అతడి తల్లి—"ఏమిటోరా-ఈ రోజు కళ్ళు తెలియని నిద్ర వచ్చేస్తోంది—" అని వెళ్ళి నిద్రపోయింది.

ముత్యాలరావుకు చాలా ఆశ్చర్యం కలిగింది. తల్లి ఎప్పుడూ అలా చేయలేదు. సాధారణంగా తను నిద్ర పోయినాకనే ఆమె నిద్రపోతుంది.

ఓ పట్టాన అతడికి నిద్ర రాలేదు. రాత్రి పదిన్నరకు కాబోలు యెవరో అతడి ఇంటి తలుపు తట్టారు. వెళ్ళి తలుపు తీశాడు ముత్యాలరావు.

వేదవతి!

లేత నీలం రంగు షిఫాన్ చీర, అదే రంగు బ్లవుజు, గులాబి రంగు శరీర ఛాయ, చెవులకు వ్రేలాడుతున్న పెద్ద పెద్ద రింగులు...

ఆమె వేదవతి మాత్రమే కాదు...పూర్తిగా మోహన్ వర్ణించిన విధంగానే ఉన్నది. ముత్యాలరావుకు కొద్ది క్షణాలు నోట మాట రాలేదు.

"నీకోసం వచ్చాను ముత్యం. సాయంత్రం మోహన్ ఎదురుగా నీతో యెక్కువగా మాట్లాడ్డం ఇష్టంలేక పోయింది. అందుకే మీ యింటికే స్వయంగా వచ్చాను. అత్తయ్య నిద్రపోతున్నారా?" అంది వేదవతి.

"ఊఁ" అంటూ ఆమెకు దారి ఇచ్చాడు ముత్యాలరావు.

వేదవతి తనే తలుపులు వేసింది తిన్నగా. అతడి పడకగదిలోకి దారితీసింది. ముత్యాలరావు ఆమెను అనుసరించాడు. అతడి మెదడంతా అయోమయంగా ఉన్నది.

ఇద్దరూ గదిలో కూర్చున్నారు. వేదవతి మంచంమీద కూర్చున్నది. ముత్యాలరావు ఆమెకు ఎదురుగా ఓ స్టూలు మీద కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పు ముత్యం...ఆ రోజు నువ్వు మన ప్రోగ్రాం ఎందుకు పాడు చేశావు?"

"ఏ రోజు?"

"అదే...పెళ్ళికి ముందే నువ్వు నన్ను నీ దాన్ని చేసుకోవాలనుకున్న రోజు...."

"ఆ రోజా?....ఆ రోజు....ఆ రోజు...." ముత్యాలరావు కొద్ది క్షణాలు తడబడి — "ఆ రోజు నేను వచ్చాను. నీ శవాన్ని చూశాను...." అన్నాడు.

వేదవతి కిలకిలా నవ్వి—"అంతా మోహన్ చెప్పినట్లే చేశావు...." అంది.

"అంటే?"

"మోహన్ నన్ను ప్రేమిస్తున్నాడు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. అతడికది ఇష్టంలేకపోవడం సహజమే కదా! నీ గురించి ఎన్నో అన్నాడు. తనైతే నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాట్ట. నువ్వేమో పిరికివాడివట స్వార్థపరుడివట. నన్ను మోసం చేయాలనుకుంటున్నావుట. నేను అన్నింటినీ ఖండిస్తే తనన్నాడూ—ఓసారి ఆశపెట్టి అతడిని నీ గదికి ఆహ్వానించు. అక్కడ నువ్వు హత్యచేయబడినదానిలా పడివుండు. అప్పుడతడు నీ చావుకు విలపిస్తాడో, హత్యా నేరానికి భయపడి పారిపోతాడో చూడు. పారిపోయినవాడు స్వార్థపరుడు. లేనిపక్షంలో అసలైన ప్రేమికుడు!

ఈ మాటల్ని నేనో సవాలుగా తీసుకుని నిన్ను పరీక్షించాను. ఆ రోజు నువ్వు నా దగ్గరకు వచ్చి నాలో ఇంకా కొంత ప్రాణం ఉన్నదేమోనని పరీక్షిస్తావనుకున్నాను. అలా చేస్తే అప్పుడే నీ వశం కావాలనుకున్నాను. కానీ అలా జరుగలేదు. నువ్వు పారిపోయావు"

అని నిట్టూర్చింది వేదవతి.

ముత్యాల్రావు కాస్త సిగ్గుపడ్డాడు. వేదవతి తనను కున్నంత సామాన్యురాలు కాదనీ ఆమె తననుకున్నంత సులభంగా శీలాన్ని నిర్లక్ష్యం చేయదనీ అతడు గ్రహించాడు. తనామెను మోసం చేయాలని అనుకుంటే ఆమె తన స్వార్థాన్ని బయటపెట్టే పథకం వేసింది.

ఆ రోజు తనకేమయింది? తన్ను తాను అర్పించుకొనడానికి సిద్ధపడిన వేదవతి అక్కడ నిర్జీవంగా పడివుంటే ఆమె గురించి ఆలోచించకుండా, వ్యథపడకుండా అక్కణ్ణించి పారిపోయి ఆమె దృష్టిలో చులకన అయిపోయాడు.

"ఆ రోజు నా ప్రవర్తన విషయమై చాలా సిగ్గుపడుతున్నాను వేదా! ఏమిటో ఆ క్షణంలో అంతులేని భయం నన్నావహించింది...." అన్నాడు ముత్యాల్రావు.

"ఆ రోజు సంగతి సరే....ఆ తర్వాత మాత్రం నువ్వేం చేశావు? క్షణం కూడా నా గురించి దిగులుపడలేదు. పైగా నా చావుని ఉపయోగించుకుని మోహన్ని బ్లాక్ మెయిల్ చేయాలనుకున్నావు! డబ్బు సంపాదించాలనుకున్నావు ..."

"నువ్వు పొరపాటు పడుతున్నావు...." అన్నాడు ముత్యాల్రావు తడబడుతూ.

"ఇన్నాళ్ళూ నేను మోహన్ ఇంట్లోనే ఉన్నాను. నువ్వు మాట్లాడిన ప్రతి మాటా అక్షరం పొల్లుపోకుండా విన్నాను. నువ్వు చాలా సామాన్యుడివి. మోహన్ ఇలాంటి విషయాల్లో అఖండుడు. ఉత్తరం రాగానే అది నీ నుంచేనని గ్రహించాడు. వెంటనే అక్కడ డబ్బు

పాతిపెట్టించాడు. ఆ తర్వాత నీకూ ఉత్తరం వచ్చిందంటూ తనవద్దకు రాగానే నీ పథకం సులభంగా తెలుసుకోగలిగాడు. నువ్వు చాలా చచ్చు పథకం వేశావు. మోహన్‌లాంటి వాళ్ళతో నువ్వులాంటి పథకాలు వేయకూడదు. నా గురించి కానీ లేకపోతే అతడు నిన్ను పులుసులోకి ఎముకల్లేకుండా తన్నించేవాడు.

ఈ రోజు నేను నిన్ను కలుసుకుని మాట్లాడుతానంటే మీ అమ్మకు త్వరగా నిద్ర వచ్చే ఏర్పాటు చేశాడు. భోజనానికి ముందు ఆమె వేసుకునే మాత్రల సీసాలో నిద్రమాత్రలు మార్చాడు. రెండు మాత్రలూ ఒకే రకంగా ఉండడంవల్ల ఆమెకు తేడా తెలిసి ఉండదు" అంటూ ఆమె అతడి చేతికి ఓ పొట్లం అందించి—"ఆ మాత్రల సీసాలో నిద్రమాత్రలు తీసేసి మళ్ళీ ఇవి పోసేయ్...." అంది.

ముత్యాలరావు ఆశ్చర్యంగా ఆమె చెప్పేది వింటున్నాడు. మాట్లాడుదామంటే అతడికి నోట మాట రావడం లేదు.

"మోహన్ గురించి విన్నావు కదా....అతడు నన్ను ప్రేమిస్తున్నాడు. నేను లేనిదే బ్రతకలేనంటున్నాడు.." అంది వేదవతి మళ్ళీ.

"ఇదంతా నాకెందుకు చెబుతున్నావ్?" అన్నాడు ముత్యాలరావు.

"ఎందుకో ఊహించుకో!" అంది వేదవతి.

"ఏమో—నాకు తెలియదు...." అన్నాడు ముత్యాలరావు.

వేదవతి కిలకిలా నవ్వింది — "సాయంత్రం కూడా నువ్విలాగే ముఖం పెట్టావు మోహన్ ఇంట్లో. అప్పుడూ

నాకు చాలా నవ్వొచ్చింది. అసలు నువ్వేమీ ఊహించ లేవు...." అంది.

"అక్కడ మోహన్ ఏం చేశాడో నేనూహించాను" అంటూ వాసు తనకు చెప్పింది అతడామెకు చెప్పాడు.

"చాలా గొప్ప విశేషం అనుకున్నావు. తెలివైన వాడివే....అది సరే....మరి మోహన్ అలాంటి నాటక మెందుకాడాడో ఊహించగలిగేవా?"

"లేదు...."

"వేదవతి చచ్చిపోయిందన్న భావం అతడు నీలో ప్రవేశ పెట్టదల్చుకున్నాడు...."

"అందుకు నువ్వు అతడికి సహకరిస్తున్నావు...." అన్నాడు ముత్యాలరావు కోపంగా.

"కానీ నాకంటే ఎక్కువగా నువ్వే అతడికి సహకరిస్తున్నావు...." అంది వేదవతి.

"అంటే?"

"నేను నీ గొప్పతనం గురించి మోహన్‌కు ఋజువు చేయాలనుకుంటూంటే నువ్వు నాకు కాక మోహన్‌కే సహకరిస్తున్నావు...."

"నేను నీ కెందుకు సహకరించాలి?" అన్నాడు ముత్యాలరావు.

"ఎందుకా? నేను నిన్ను ప్రేమిస్తున్నాను కాబట్టి" అంది వేదవతి.

"ఇంకానా?" అన్నాడు ముత్యాలరావు అప్రయత్నంగా.

వేదవతి — నవ్వి — "ఇంకానా అనేశావు అనుకోకుండా! అంటే నువ్వు నా ప్రేమకు అర్హుడివి కాదని నీ మనసు నీకు చెబుతుంది. కానీ ముత్యం....ఈ ప్రపం

చంలో మగాడు ఆడదాన్ని అర్థం చేసుకోవడమన్నది యుగాంతానికి కూడా జరుగదు. నువ్వు గొప్పవాడివని నేను నిన్ను ప్రేమించడం లేదు. నేను ప్రేమించాను కాబట్టి నువ్వు నాకు గొప్పవాడివి. ఆ విషయం నీకూ అర్థంకాదు. మోహన్‌కూ అర్థంకాదు. అందుకే తన గొప్పతనం ఋజువు చేసుకోవాలని అతడు ప్రయత్నిస్తున్నాడు. నువ్వు తక్కువేమోనని నువ్వనుకుంటున్నావు. మోహన్ ఈ ప్రపంచానికే ఏలిక అయినప్పటికీ నేనతణ్ని పెళ్ళి చేసుకోలేను. ప్రేమించలేను. నువ్వెంకా ఘోరంగా ప్రవర్తించినా నేను నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను. అది నా బలహీనత....'' అంది.

ముత్యాల్రావు ఆలోచిస్తున్నాడు. తన తప్పుల్ని కూడా మన్నించి ఆమె తనను ప్రేమిస్తున్నది. అలాంటి వనిత తనకు భార్య అయితే జీవితం ఎంతో సుఖంగా ఉంటుంది. ఆమెను తను వదులుకోరాదు. కానీ....

“మోహన్ నా గురించి సవాలుచేస్తే నువ్వతనికే సహకరించి నన్నో వెర్రి వెధవను చేసి ఆడించావు. నువ్వు నన్ను ప్రేమిస్తున్నట్లు ఎలా నమ్మేది?'' అన్నాడు ముత్యాల్రావు.

“నేను మోహన్‌కు సహకరించడానికి బలమైన కారణముంది. నేను నీకు మోహన్ శక్తిసామర్థ్యాలు ఋజువు చేయదల్చాను. అలాంటి మోహన్‌ని కాదని నిన్ను చేసుకోబోతున్నానన్న విషయం నీకు స్పష్టంగా చేసి నా ప్రేమ బలాన్ని నిరూపించుకోవాలని తాపత్రయపడ్డాను. అందుకే అతడికి సహకరించాను....'' అంది వేదవతి.

ముత్యాల్రావు ఆమె ముఖం వంక చూశాడు. ఆమె

కళ్ళలో నిజాయితీ కనబడుతోంది. అప్పుడతడు నెమ్మదిగా "నీ ప్రేమ బలాన్ని నువ్వు నిరూపించుకున్నావు. కానీ నా ప్రేమ బలాన్ని నేనూ నిరూపించుకుంటే తప్ప నాకు తృప్తిగా ఉండదు. అందుకు నువ్వే నాకో అవకాశ మివ్వాలి...." అన్నాడు.

"ఏమిటది?"

"సాధారణంగా పురుషుడు ఏం చేస్తాడు? ఆడదాన్ని అనుభవించేక-నువ్వెవరో నాకు తెలియదు పొమ్మంటాడు. లేదా నువ్విలా ఎందరితో తిరిగావో అంటాడు. నువ్వు నాకు అలా అనే అవకాశం ఒకటివ్వు. అప్పుడు నేను నిన్ను భార్యగా స్వీకరించి నా ప్రేమ బలాన్ని ఋజువు చేసుకుంటాను...."

కథ మళ్ళీ మొదటికి వచ్చింది. అతడా మెత్తో పెళ్ళికి ముందే అనుభవాన్ని కోరుతున్నాడు. దానికి ప్రేమ బలాన్ని పరీక్షించుకోవడం అనే ముసుగు వేస్తున్నాడు. వేదవతి అదే అతడికి చెప్పి—"పరీక్ష పేరుతో మరోసారి నీ స్వార్థాన్ని బయటపెట్టావు. అయినప్పటికీ నీకు సహక రించి నా ప్రేమ బలాన్ని ఋజువు చేసుకుంటాను...." అంది.

ముత్యాలరావు వళ్ళు పులకరించింది—"ఇప్పుడే?" అన్నాడు ఉత్సాహంగా.

"ఇప్పుడూ కాదు, ఇక్కడా కాదు...." అంది వేదవతి.

"మరి?"

"నాకు కొన్ని ఆదర్శాలున్నాయి. ఆశయాలున్నాయి. పెళ్ళికి ముందు మగవాడికి శరీరం అర్పించడం నాకిష్టం లేదు. అందుకని ఓ పని చేయి. ఓ తాళిబొట్టు కొని

తీసుకునిరా! నా ఇంట్లో నేను పెళ్ళి మంత్రాల టేపు సిద్ధంగా ఉంచుతాను. ఏకాంతంలో మనిద్దరం ఉండగా ఆ మంత్రాలు వస్తూండగా నా మెడలో తాళిబొట్టు కట్టు. మన పెళ్ళి జరిగిపోయిందన్న తృప్తి నాకు ఉం టుంది. రహస్యం ఎవరికీ తెలియదు కాబట్టి—నన్ను ఆవు ననడానికీ కాదనడానికీ నీకు అవకాశమూ ఉంటుంది. అప్పుడు నువ్వు నీ ప్రేమ బలాన్ని ఋజువు చేసుకోన వచ్చును...." అంది వేదవతి.

ముత్యాలరావుకు మనసు చివుక్కుమంది. ఏదో తప్పు చేస్తున్నానన్న భావం అతడికి కలిగింది. అతడింకేమీ మాట్లాడలేదు.

"నీ జాతకం చెప్పు. ముహూర్తం పెట్టించి కబురు చేస్తాను...." అంది వేదవతి.

ముత్యాలరావామెకు తను పుట్టిన తేదీ, సమయం చెప్పాడు. వేదవతి వెళ్ళిపోయింది. ఆ తర్వాత కూడా అతడికి నిద్రపట్టలేదు.

8

"ఇంత రాత్రివేళ యెక్కడికెళ్ళి బయల్దేరావ్?" అంది మాలతమ్మ కొడుకు వంక ఆశ్చర్యంగా చూస్తూ— "సెకండ్ షో సినిమాకా?"

"కాదమ్మా—" అన్నాడు ముత్యాలరావు—"మా ఆఫీసులో ఒకతనికి ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతున్నాడు. రాత్రి మేమంతా స్పెషల్ పార్టీ చేసుకుంటున్నాం. నేనింక ఉదయమే ఇంటికి వస్తాను...."

"స్పెషల్ పార్టీ అంటేఁ?" అంది మాలతమ్మ.

ముత్యాలరావు కళ్ళముందు తను, వేదవతి ఒకరి కౌగిలిలో ఒకరు ఐక్యమైపోతున్న దృశ్యం కనబడు

తున్నది.

"స్పెషల్ పార్టీ అంటే స్పెషల్ పార్టీయే...." అని ఇంట్లోంచి బయటపడి — టైము చూసుకున్నాడు. తొమ్మిదిన్నరయింది. వేదవతి ఇల్లు చేరుకొనడానికి అర గంట కంటె పట్టదు.

ముత్యాలరావు జేబులు తడుముకున్నాడు. తాళిబొట్టు తగిలింది.

ఇందులో ఏమీ మోసం లేదు కదా!

తను తాళి కడుతూండగా ఎవరైనా రహస్యంగా ఫోటో తీస్తే....

తను జాగ్రత్తగా పరిసరాలు గమనించాలి. గదిలో అన్ని తలుపులూ, కిటికీలతో సహా మూసేయాలి. ఆపైన గదిలో యెక్కడా కెమెరా అమర్చబడలేదని ధృవ పర్చుకోవాలి. గదిలో దీపం ఆర్పేసి ఆ చీకట్లో ఆమె మెడలో తాళి కట్టాలి. చీకట్లో తాళి కడుతూండగా ఎవరైనా ఫోటో తీసే మాటైతే ప్లాష్ తళుక్కుమం టుంది. అదీకాక చీకట్లో తామెక్కడ ఉంటారో కెమేరా పట్టుకున్నవాడికి ఎలా తెలుస్తుంది?

పదిగంటలకల్లా వేదవతి ఇల్లు చేరాడు ముత్యాలరావు.

అంతా తన అదృష్టం! ఇంటివాళ్ళు అనుకోకుండా ఊరికి వెళ్ళారు. వేదవతి ఈ రోజుకు ముహూర్తం పెట్టింది. ఇంత త్వరగా తనకిలాంటి అవకాశం వస్తుందని ముత్యాలరావు అనుకోలేదు. ఎటొచ్చీ అవకాశం ఉపయో గించుకున్నాక ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాడతడు. వేదవతిని మోసం చేయవచ్చునా—కూడదా?

తలుపులు ఓగ వాకిలిగా వేసి వున్నాయి. గదిలో దీపం వెలుగుతున్నట్లు తెలుస్తున్నది. ముత్యాలరావు

తలుపులు తీసి ఆశ్చర్యంగా ఆగిపోయాడు.

గదిలో మంచం. మంచంమీద వేదవతి. ఆమె చేయి ఒకటి క్రిందకూ వేలాడుతున్నది. వంటిమీద బట్టలు అ స్తవ్యస్తంగా ఉన్నాయి. సూటిగా గుండెల్లోకి దిగిన కత్తి పిడి పైకి కనబడుతున్నది. రక్తం ధారగా ప్రవహించిన సూచనలున్నాయి.

సుమారు నెలరోజుల క్రితం తను చూసిన దృశ్యానికీ ఈ దృశ్యానికీ పెద్దగా తేడా లేదు.

ముందు ఆశ్చర్యపోయినా ధైర్యం తెచ్చుకున్నాడు ముత్యాల్రావు.

ఒకసారి వేదవతి ఇలాగే తనను పరీక్షించింది. మోహన్ వంటి అఖండుడామెను ప్రేమిస్తూండగా ఎవరూ ఆమెను హత్య చేయలేరు. అయినా ఎవరైనా ఆమెను హత్య చేయాలని ఎందుకనుకుంటారు?

సందేహం లేదు—ఆమె మళ్ళీ తనతో నాటకమాడుతున్నది.

ముత్యాల్రావు నాలుగడుగులు ముందుకువేసి ఆమెను సమీపించి—గుండెలవద్దనున్న రక్తాన్ని తాకాడు. రక్తం జిగురుగా వున్నదనిపించింది.

"ఏమి రంగు వాడిందో—నిజం రక్తంగానే ఉన్నది" అని మనసులో అనుకుని—"వేదవతీ—ఇంకా నీ నాటకం కట్టిపెట్టి—లే!" అన్నాడు.

ఆమె కదలలేదు.

అతడామెను పట్టుకుని కుదిపాడు.

అప్పుడు కదిలింది వేదవతి—అతను కుదపడంవల్ల. మోకాళ్ళమీద వంగి కుదపడంవల్లనేమో—ఆమె అతడి మీద పడింది.

ముత్యాల్రావు వెల్లకిలా పడ్డాడు. అతడి మీద వేదవతి పడింది.

తనమీద మనిషి కాక శవమే పడినట్లు అనిపించింది ముత్యాల్రావుకు.

వేదవతి శవం బిగుసుకుని ఉన్నది. శరీరం కాస్త చల్లబడినట్లున్నది.

ముత్యాల్రావు కెవ్వుమని కేక వేసి వేదవతిని తనమీద నుంచి తొలగించాడు. అతడిలో కంగారు ప్రారంభమయింది. అతడామె గుండెల్లో దిగిన కత్తి పిడిని తాకాడు. అతడి బట్టలు రక్తసిక్తాలయ్యాయి. అక్కడ మడుగు కట్టిన రక్తంలో అతడి పాదముద్రలు పడ్డాయి.

అతడి కేక వినడం వల్లనో ఏమో కొంతమంది జనం ఆ యింటిముందుకు వచ్చారు. వారిలో ఒకడు లోపలకు తొంగిచూసి — "హత్య....హంతకుడు...." అంటూ పెద్దగా కేకలు పెట్టాడు.

అది విని ముత్యాల్రావు ఉలిక్కిపడి అటు చూసి— "నో....నో.... నేను హంతకుణ్ని కాదు...." అంటూ అరిచాడు.

9

"నువ్వామెను బలవంతాన పెళ్ళాడాలనుకున్నట్లు నీ జేబులోని తాళిజొట్టు చెబుతోంది. ఆమె నీ కోరికను కాదన్నందుకు ఆవేశపడి ఆమెను చంపేశావు. కత్తిపిడి మీద నీ వేలిముద్రలున్నాయి. అన్నింటికీ మించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డావు. మర్యాదగా నేరం ఒప్పుకో.... లేనిపక్షంలో నీచేత ఒప్పించాల్సి ఉంటుంది...." అన్నాడు పోలీసు ఇన్స్పెక్టర్.

"నాకేం తెలియదు. నేను నిర్దోషిని—" అరిచాడు

ముత్యాలరావు.

"హత్య చేసిన ప్రతివాడూ నీకులాగే అంటాడు తప్పితే నేరం ఒప్పుకోడు. నేరం ఒప్పించడానికి మేమెలాంటి పద్ధతులవలంభిస్తామో నీకు తెలియదు. ఆ పద్ధతులవల్ల నేరం చెయ్యనివాడు కూడా చేశాననే పరిస్థితి ఏర్పడుతూంటుంది. బాగా ఆలోచించుకో— నీకు మరొక్క గంట వ్యవధి ఇస్తున్నాను—ఆ తర్వాత నేను మనిషిని కాను...."

ముత్యాలరావు భయం భయంగా ఇన్స్పెక్టర్ వంక చూశాడు— "సార్! ఎలా మిమ్మల్ని నమ్మించాలో నాకు తెలియడంలేదు. నిజంగా నేను నిర్దోషిని. మీరు నన్ను ఉరికంబమెక్కిస్తే—అసలు హంతకుడు దర్జాగా సమాజంలో తిరుగుతూ మరి కొన్ని హత్యలు చేస్తాడు.... ప్లీజ్ ఇన్స్పెక్టర్ .... నేను హంతకుణ్ని కాను...."

"అలా అంటూండు. సరిగ్గా ఓ గంట తర్వాత అసలు నిజం నీచేత చెప్పిస్తాను...." అన్నాడు ఇన్స్పెక్టర్ కసిగా.

"అతడు నిజమే చెబుతున్నాడు ఇన్స్పెక్టర్!" అన్న గొంతు వినిపించి ఇన్స్పెక్టర్, ముత్యాలరావు కూడా అటు తిరిగారు.

అక్కడ మోహన్ నిలబడి ఉన్నాడు.

"మీరెవరు?" అన్నాడు ఇన్స్పెక్టర్.

"వేదవతిని చంపినవాడిని...." అన్నాడు మోహన్- "మీరు నన్ను ప్రశ్నించాలని రెండ్రోజులుగా ప్రయత్నిస్తున్నారు. నేను దొరకలేదు. ఈ రోజు నేనే మీ దగ్గరకు వచ్చేశాను. అడక్కుండా నే అన్నీ చెప్పేస్తాను. నా వాఙ్మూలం తీసుకోండి...."

ఇన్‌స్పెక్టర్‌కంతా ఆశ్చర్యంగా వుంది. మోహన్ వాఙ్మూలం తీసుకునేందుకు అప్పటికప్పుడు ఏర్పాట్లు జరిగాయి.

"నేను వేదవతిని ప్రేమించాను. కానీ ఆమె ముత్యాలరావును ప్రేమించింది. పెళ్ళికి ముందే తన్ను తానర్పించుకునేందుకామె సిద్ధపడింది. దాపరికం లేకుండా ఉన్నదున్నట్లు ఎప్పటికప్పుడు నాకు చెప్పేది. నాలో కసి బయల్దేరింది. నాకు దక్కని వేదవతి ముత్యాలరావుకీ దక్కకూడదని ఓ పథకం వేశాను. ఓ రోజు ఆమెను చనిపోయినట్టు నటించమన్నాను. ఆ తర్వాత అది నటన అని ముత్యాలరావుకు తెలిసేలా చేయమన్నాను.

ఆ తర్వాత వాళ్ళిద్దరూ ఒకరిలో ఒకరు ఐక్యం కావాలని నిర్ణయించుకున్న రోజున ఆమెను చంపేశాను. అంతకు మునుపులాగే వేదవతి నటన అని నమ్మి ముత్యాలరావు అక్కడ రక్తం ముట్టుకున్నాడు. వేలిముద్రలు వదిలాడు. పోలీసులకు పట్టుబడ్డాడు. నా తెలివితేటలలో వేదవతినీ, ముత్యాలరావునూ పరలోకానికి పంపే ఏర్పాట్లు చేశాను. కానీ ఈ రెండ్రోజుల్లోనూ నాకో విషయం తెలిసింది...."

"ఏమిటి?"

"వేదవతి లేని ఈ ప్రపంచం నాకు శూన్యంగా తోస్తున్నది. మరో లోకమంటూ వుంటే అక్కడ వేదవతి, ముత్యాలరావు కలుసుకుని ఒకటవుతారన్న అసూయభావం నన్ను దహించి వేస్తున్నది. నా నేరం ఒప్పేసుకుని నేనే సరాసరి వేదవతి వద్దకు వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను...."

ఇన్‌స్పెక్టర్ అతడిని చాలా ప్రశ్నలు వేశాడు.

అన్నింటికీ మోహన్ సమాధానాలు చెప్పాడు. తనే ఆ హత్య చేసినట్లు నమ్మడానికి అవసరమైన సాక్ష్యాధారాలన్నీ సూచించాడు. ఇన్‌స్పెక్టర్‌కి అతడే హంతకుడని నమ్మకం కుదిరింది.

10

ముత్యాలరావుకి అంతా కలలా వున్నది. అతడు తనకు ఉరిశిక్ష ఖాయమనీ ప్రాణాలు పోయినవనే అనుకున్నాడు. కానీ చిత్రంగా మోహన్ తనకు తానే వచ్చి తన ప్రాణాలు రక్షించాడు.

విడుదలై ఇంటికి వచ్చిన కొడుకును కౌగలించుకొని భోరున ఏడ్చింది మాలతమ్మ.

ముత్యాలరావు ఆలోకలాగున్నాడు. వేదవతి ప్రేమ ఎంత గొప్పది? ఆమెకోసం మోహన్ ప్రాణాలు వదలడానికి నిర్ణయించుకున్నాడు. అనవసరంగా ఆ అమర ప్రేమికుల మధ్య తను ప్రవేశించి-ఇద్దర్నీ ఈ లోకంలో లేకుండా చేశాడు.

వేదవతి తనను ప్రేమించకుండా ఉండాల్సింది....

ముత్యాలరావు రాత్రి ఒక్కడూ తన గదిలో కూర్చున్నాడు. నిద్రవచ్చేలా లేదతడికి...

ఉన్నట్లుండి అతడి కనులముందు వేదవతి ఉన్నది.

అతడు ఉలిక్కిపడి—"ఎలా వచ్చావ్?" అన్నాడు.

"నా ప్రేమ బలాన్ని ఋజువు చేసుకుంటున్నాను. మోహన్‌ని నా వైపు ఆకర్షించుకుని తన నేరాన్ని ఒప్పుకునేలా చేసి—చనిపోయాక కూడా నీకు సాయపడ్డాను. ఇంతకంటే ఏ విధంగానూ నా ప్రేమ బలాన్ని ఋజువు చేసుకోలేను...." అంది వేదవతి.

"వేదవతీ....నువ్వు బ్రతికే వున్నావు. జరిగిందంతా

నాటకం. అవునా?" అని అరిచాడు ముత్యాల్రావు.

అతడి ఎదురుగా వేదవతి నవ్వుతున్నది.

వెనుకనుంచి అతడి భుజంమీద ఎవరిదో చేయిపడింది. చటుక్కున వెనక్కి తిరిగాడు.

మాలతమ్మ...."నాకెవ్వరూ కనబడ్డం లేదు. ఎవరితో మాట్లాడుతున్నావురా?" అన్నదామె.

"ఇదీ గతంలోలాగే నాటకమైతే బాగుండును—" అనుకున్నాడు ముత్యాల్రావు. కానీ అది నాటకం కాదు.

—: అయిపోయింది :—